సాక్షి అనంతపురం

శనివారం । 26 । అక్టోబర్ । 2024



హన్నా.. గెలుపు మిన్న..!

జన్యుపరమైన లోపం ఉందని బాధపడ లేదు. బాగా చదివి శాస్త్రవేత్తగా ఎదిగారు. 'మిస్‌వరల్డ్ ట్రాన్స్' పోటీల్లో రన్నర ప్‌గా నిలిచి సెలబ్రిటీ అయ్యారు. 10లో



టమాట కిలో రూ.32

కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్ట ధర రూ.32 పలికింది. కనిష్టం రూ.9, సరాసరి రూ.21 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.4°/ 18.7°

జిల్లాలో శుక్రవారం పగలు ఉష్ణోగ్రతలు స్థిరంగానూ, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుదలగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

జిల్లాకు వర్ష సూచన



బుక్కరాయసముద్రం: ఉమ్మడి అనంతపురం జిల్లాకు రాబోయే రెండు రోజులు వర్షసూచన ఉన్నట్లు రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో చిరుజల్లులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం టౌన్: ఉపాధి హామీ పథకం కింద పశువులు, గొర్రెలు, మేకల సంరక్షణ కోసం మినీ గోకులాలు (షెడ్లు) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ) సలీంబాషా తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు పశువుల కోసం రూ.లక్ష, నాలుగు పశువులకు రూ.1.80 లక్షలు, ఆరు.. అంతకంటే ఎక్కువ పశువుల యూనిట్‌కు రూ.2.30 లక్షలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గొర్రెలు, మేకలు వంద ఉంటే రూ. లక్ష, 200 ఉంటే రూ.2.30లక్షలు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న పాడి, గొర్రెల కాపరులు దగ్గరలోని ఎండీపీఓ కార్యాలయంలో నవంబర్ ఐదో తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాకు దాదాపు 1,475 గోకులాలు మంజూరు అయ్యాయని తెలిపారు. వీటితోపాటు ఊరురా పశుగ్రాస క్షేత్రాలు ఏర్పాటు చేసేందుకు జిల్లాకు వెయ్యి ఎకరాలు మంజూరైనట్లు పేర్కొన్నారు. మండలం యూనిట్‌గా 30 ఎకరాల మేర పశుగ్రాసం ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఒక రైతుకు నికరంగా 0.25 ఎకరాల మేర పశుగ్రాసాన్ని పెంచుకునేందుకు అవకాశం కల్పించినట్లు వెల్లడించారు. పావు ఎకరాకు రూ.25 వేల చొప్పున రెండేళ్లపాటు అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డీఈఓ వరలక్ష్మి రిలీవ్

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) బి.వరలక్ష్మి రిలీవ్ అయ్యారు. రాష్ట్రంలో పలువురు డీఈఓలను బదిలీ చేస్తూ ప్రభుత్వం జీఓ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా వరలక్ష్మి చిత్తూరుకు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కార్యాలయానికి వచ్చిన ఆమె ఎవరితోనూ మాట్లాడలేదు. ఏడీ కృష్ణయ్యను పిలిపించి రిలీవ్‌కు సంబంధించిన ఫైల్ కలెక్టర్‌కు పంపేందుకు సిద్ధం చేయాలని సూచించారు. ఆ వెంటనే సిద్ధమైన ఫైలు తీసుకుని నేరుగా క్యాంపు కార్యాలయానికి వెళ్లి కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి రిలీవ్ అయ్యారు. తాత్కాలికంగా ఏడీ–2, సమగ్రశిక్ష ఏపీసీ నాగరాజుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

27న కొత్త డీఈఓ బాధ్యతలు

అన్నమయ్య జిల్లాలో విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఎం.ప్రసాద్‌బాబును అనంతపురం డీఈఓగా నియమించారు. ఈ నెల 27న ప్రసాద్‌బాబు బాధ్యతలు తీసుకోనున్నారు. 28న విజయవాడలో విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కోన శశిధర్ కొత్త డీఈఓలతో సమావేశం నిర్వహించనున్నారు. బాధ్యతలు తీసుకున్న తర్వాత ప్రసాద్‌బాబు విజయవాడ బయలుదేరి వెళతారు.

4 నుంచి డీఎడ్ పరీక్షలు



పుట్టపర్తి: డీఎడ్ (2018–20 బ్యాచ్‌కు మొదటి సంవత్సరం) విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నవంబర్ 4 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ రవి సాగర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ఇక 2023–25 బ్యాచ్ డీఎడ్ విద్యార్థులకు సెకండ్ సెమిస్టర్ (రెగ్యులర్, సప్లిమెంటరీ) పరీక్షలు నవంబర్ 4వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులు www. bse. ap. gov. in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలో కొన్ని ప్రైవేట్ డీఎడ్ కళాశాలలు మూతపడ్డాయని, అలాంటి కళాశాలల్లో చదివిన విద్యార్థులు అదనపు ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చన్నారు. మరింత సమాచారం కోసం బుక్కపట్నంలోని జిల్లా డైట్ కళాశాలలో ఈ నెల 30వ తేదీ లోపు సంప్రదించాలన్నారు.

ఉన్నత చదువులకు గ్రహణం

❒ శ్రీసత్యసాయి జిల్లా కదిరికి చెందిన రఘునాథ అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు. గతేడాది ఒక త్రైమాసికం ఫీజు మాత్రమే చెల్లించారు. తక్కిన మూడు త్రైమాసికాల ఫీజు చెల్లించలేదు. మూడు టర్మ్ ఫీజులు చెల్లించాల్సి ఉందని కళాశాల సిబ్బంది సర్టిఫికెట్ ఇవ్వడానికి నిరాకరించారు. మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చింది. అయినా ఉద్యోగంలో చేరడానికి సర్టిఫికెట్ లేదు. దీంతో ఎలాగైనా ఉద్యోగంలో చేరాలని రఘునాథ అప్పు చేసి మరీ ఫీజు చెల్లించాడు. ఇప్పటిదాకా ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం రాలేదు. అసలు ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందా? రాదా? తెలియని పరిస్థితి.

❒ అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయ్ బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. గతేడాదికి సంబంధించిన మూడు టర్మ్ ఫీజులు రీయింబర్స్ కాలేదు. ఒక త్రైమాసికానికి సంబంధించి మాత్రమే ఫీజు కట్టాడు. దీంతో ఫీజు కడితేనే కళాశాలకు రావాలని యాజమాన్యం హెచ్చరించింది. తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ఉదయ్ తల్లిదండ్రులు అప్పు చేసి కొంత ఫీజు చెల్లించారు. నవంబర్‌లో సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయి. పరీక్ష ప్రారంభంలోపే మొత్తం ఫీజు చెల్లిస్తేనే అనుమతిస్తామని షరతు విధించారు. ఈ నేపథ్యంలో ఫీజు కట్టడానికి ఇబ్బందులు పడుతున్నారు.

❒ "పరీక్షలు రాయాలంటే ముందు ఫీజు కట్టండి.. చివరి సంవత్సరం పాసైన వాళ్లకు సర్టిఫికెట్లు ఇవ్వాలంటే ఫీజులు మొత్తం చెల్లించాల్సిందే. మెస్, హాస్టల్ చార్జీలు కడితేనే గదులు కేటాయిస్తాం. కొత్త ప్రభుత్వం వచ్చింది. ఇక మీకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందని ఆశ పడొద్దు.. అప్పోసప్పో చేసి తీర్చండి. లేదంటే మీ చదువులకు కచ్చితంగా ఆటంకాలు తప్పవు. ఆ తర్వాత మాది బాధ్యత కాదు.."

ఇదీ జిల్లాలో డిగ్రీ, ఇంజినీరింగ్, డిప్లొమో కాలేజీ యాజమాన్యాల బెదిరింపు ధోరణి.



- విడుదలకాని ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు
- ఫీజులు కట్టాలంటూ కాలేజీ యాజమాన్యాల ఒత్తిడి
- సర్టిఫికెట్లు, హాల్‌టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులకు ఇబ్బందులు

అనంతపురం: పేదింటి పిల్లలు ఉన్నత విద్య చదువుకోవాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన పథకం 'ఫీజు రీయింబర్స్‌మెంట్'. ఇన్నాళ్లూ పథకం సజావుగా అమలైంది. ఎంతోమంది విద్యార్థులు ప్రభుత్వం అందించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఉన్నత చదువులు ఉచితంగా చదువుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి పట్టించుకోకపోవడంతో విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా తయారైంది. జిల్లాలో 40,006 మంది విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. వీరికి ప్రతి మూడు నెలలకు (త్రైమాసికానికి) రూ.29.08 కోట్ల ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదికి రూ.116.32 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని విద్యార్థులకు అందించాలి.

ఉన్నత విద్యారంగంలో కుదుపు..

ఐదేళ్ల పాటు నిశ్చింతగా ఉన్న ఉన్నత విద్యారంగంలో ఒక్కసారిగా కుదుపు మొదలైంది. ఇన్నాళ్లూ ప్రభుత్వం ఇచ్చిన భరోసాతో చదువుల్లో రాణిస్తున్న పేదింటి బిడ్డల్లో తీవ్ర ఆందోళన రేకెత్తించే పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇంత వరకు విడుదల కాకపోవడంతో పిల్లల చదువుల పరిస్థితి గాలిలో దీపంలా మారింది. విద్యా సంవత్సరం ఇప్పటికే దాదాపు సగం పూర్తయ్యింది. మరో వైపు కోర్సులు పూర్తి చేసిన వారి చేతికి సర్టిఫికెట్లు అందాలంటే బకాయిలు చెల్లించాలని కోరడంతో ఆందోళన చెందుతున్నారు. ఉద్యోగాలు వచ్చినా అందులో చేరలేని పరిస్థితి ఎదురవుతోంది.

తల్లిదండ్రుల్లోనూ ఆందోళన

ఇంత కాలం ప్రతి మూడు నెలలకొకసారి (త్రైమాసికం) విడుదల చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ (ట్యూషన్ ఫీజు) చెల్లింపులు నిలిచిపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. మరో వైపు ఇంటికి దూరంగా ఉంటూ ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయంతో (వసతి దీవెన) హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులపై ఒక్కసారిగా అప్పు భారం పడింది. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ హయాంలో అమలైన పథకాలకు పేర్లు మార్చిందే కానీ వాటి అమలు విస్మరించింది.

నాడు సాఫీగా ఉన్నత చదువులు

పేదింటి విద్యార్థులను అత్యున్నత ప్రమాణాలు కలిగిన కళాశాలల్లో చదివించి వారి భవిష్యత్తుకు వైఎస్ జగన్ ప్రభుత్వం బంగారు బాట వేసింది. విద్యార్థులు, కళాశాలలు ఎక్కడా ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టింది. చదువుల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించింది. 2017 నుంచి 2019 మధ్య బకాయి పడ్డ ఫీజులను సైతం జగన్ సీఎం అయ్యాక చెల్లించారు. వీటి చెల్లింపుల్లోనూ ఆనాటి చంద్రబాబు ప్రభుత్వం అలసత్వం వహించడంతో కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. విద్యార్థుల సర్టిఫికెట్లు, హాల్ టికెట్ల కోసం అప్పులు చేసి డబ్బులు కట్టాల్సిన దుస్థితి వచ్చింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదింట బిడ్డల విద్యను బాధ్యతగా భావించి ఆ బకాయిలను మొత్తం చెల్లించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తూ బాధ్యతను విస్మరించింది.

ప్రభుత్వానికి బాధ్యత లేదా?



పేదింటి విద్యార్థులను అత్యున్నత ప్రమాణాలు కలిగిన కళాశాలల్లో చదివించి వారి భవిష్యత్తుకు వైఎస్ జగన్ ప్రభుత్వం బంగారు బాటలు వేసింది. విద్యార్థులు, కళాశాల యాజమాన్యాలు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టింది. రాజకీయాలకు అతీతంగా సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేసింది. 2017–19 వరకు పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను సైతం గత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చెల్లించారు. విద్యార్థులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో సత్వర చర్యలు చేపట్టారు. ప్రతి మూడు నెలలకోసారి విద్యార్థులకు క్రమం తప్పకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించారు. ఎన్నికల కోడ్ సమయంలోనూ చెల్లించాలని తలపెట్టినప్పటికీ నాటి ప్రతిపక్ష టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లి రాజకీయం చేశారు. కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టి నాలుగు నెలలు గడిచినప్పటికీ విద్యార్థులకు ఫీజు చెల్లించాలనే స్పృహ లేకపోవడం శోచనీయం.

– టి.సుధీర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ విద్యార్థి విభాగం

పెండింగ్ ఫీజులు చెల్లించాలి



రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, 'వసతి దీవెన' బకాయిలు విడుదల చేయాలి. డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఫీజులు బకాయి పడింది. ఈ అంశాన్ని కళాశాల యాజమాన్యాలు పట్టించుకోకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి. కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. కోర్సులో ఉన్న వారికి హాల్‌టికెట్లు ఇవ్వడం లేదు. ప్రభుత్వం చేస్తున్న తప్పులకు విద్యార్థులను బాధ్యులను చేస్తూ శిక్ష వేయడం భావ్యం కాదు.

– ఇ.కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

పారిశ్రామిక రంగంతో యువతకు ఉపాధి

- పరిశ్రమల స్థాపనపై దృష్టి పెట్టండి
- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, హాజరైన అధికారులు

అనంతపురం అర్బన్: జిల్లాలో పారిశ్రామిక రంగం అభివృద్ధి చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలను అన్ని రకాలుగా ప్రోత్సహించాలని ఆదేశించారు. సింగిల్‌విండో పోర్టల్ ద్వారా చేసుకున్న దరఖాస్తులను నిర్ణీత వ్యవధిలో ఆమోదించాలని ఆదేశించారు. పీఎంఈజీపీ ద్వారా రుణం మంజూరైన యూనిట్లన్నీ గ్రౌండింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భవనాలను యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు కేంద్రాలుగా వినియోగించుకోవాలని సూచించారు. ఇండస్ట్రియల్ పాలసీలో భాగంగా యూనిట్లకు సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశుగణన పక్కాగా నిర్వహించాలి

పశుగణన పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పశుగణన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ అఖిలభారత పశుగణనను వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీలోగా పూర్తి చేయాలని చెప్పారు. పశుగణన ద్వారా గేదెలు, గొర్రెలు, ఆవులు, ఎద్దులు, మేకలు, పందులు ఇలా 16 రకాల పెంపుడు జంతువుల జాతుల వారీగా సమాచారం సేకరిస్తారన్నారు. పశుగణన ప్రక్రియ పశుసంవర్ధక రంగంపై ఆధారపడిన కుటుంబాల జీవనోపాధికి తోడ్పడే కార్యక్రమాలకు ఉపకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలన్నారు. జిల్లాలో 6.20 లక్షల కుటుంబాలు ఉన్నట్లు అంచనా వేశామన్నారు. పట్టణ ప్రాంతాల్లో 3 వేల ఇళ్లకు, గ్రామీణ ప్రాంతంలో 2 వేల ఇళ్లకు ఒక ఎన్యుమరేటర్‌ను నియమించామన్నారు. 31 మండలాల పరిధిలోని 493 గ్రామాల్లో ప్రతి ఇంటినీ సందర్శించి పశుగణన పకడ్బందీగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గణన ప్రక్రియ పూర్తయినట్లుగా ప్రతి ఇంటి తలుపు కుడి ఎగువ మూలలో స్టిక్కర్ అతికించాలని చెప్పారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, డీడీ రమేష్‌రెడ్డి, ఏడీలు శ్రీలక్ష్మి, రాధిక, వీఎల్‌ఓ రంగారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శింగనమలలో బండారు లీలలు

- తనయ పదవి.. తల్లి పెత్తనం
- నియోజకవర్గంలో వింత పోకడ
- బుక్కరాయసముద్రం మండల అధికారులతో ఎమ్మెల్యే తల్లి సమీక్ష
- టీడీపీ నాయకులు చెప్పిన పనులు చేయాలంటూ హుకుం
- చర్చనీయాంశంగా మారిన అనధికారిక సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తల్లి లీలావతి

సాక్షి టాస్క్‌ఫోర్స్: శింగనమల నియోజకవర్గంలో ప్రజాప్రతినిధి ఒకరైతే.. పెత్తనం మరొకరు చెలాయిస్తున్నారు. నియోజకవర్గ అభివృధి, ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించి ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించడం.. అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడం సహజం. అయితే ఇక్కడ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ స్థానాన్ని ఆమె తల్లి బండారు లీలావతి ఆక్రమించారు. అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకుని శాసిస్తున్నారు. అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తల్లి లీలావతి శుక్రవారం బుక్కరాయసముద్రం మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ అధికారితో పాటు ఇంజినీర్లు, ఇతర అధికారులు, ఎమ్మెల్యే వర్గీయులైన టీడీపీ నాయకులను పిలిపించారు. అందరినీ దగ్గర ఉండి అధికారులకు పరిచయం చేయించారు. అంతటితో ఆగకుండా 'మండలంలో మా నాయకులు, కార్యకర్తలు మీ ఆఫీసులకు వస్తుంటారు. వారికి పనులు చేయడంతో పాటు వారు చెప్పిన వారికి మాత్రమే మీరు ప్రభుత్వం తరపున సేవలందించాల'ని హుకుం జారీ చేసినట్లు సమాచారం. ఎలాంటి పదవీ లేకున్నా అధికారులతో సమావేశాలు నిర్వహించడంపై తీవ్ర చర్చ జరుగుతోంది.

ఘాటు తగ్గిన ఎండుమిర్చి

- చేతికందే సమయంలోనే వర్షం
- మిర్చి నాణ్యతపై తీవ్ర ప్రభావం
- గత ఏడాదితో పోలిస్తే క్వింటాపై రూ.7 వేలు తక్కువ



హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి క్రయ విక్రయాలు

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి రైతుల ఆశలపై వరుణుడు నీళ్లు పోశాడు. దిగుబడి చేతికందే సమయంలో రోజుల తరబడి వర్షిస్తూ కోలుకోలేని దెబ్బ తీశాడు. వర్షానికి నానిపోయిన పంటను మార్కెట్‌లో కొనేవారు లేక...దాన్ని ఎండబెట్టుకోలేక రైతులు అల్లాడిపోతున్నారు. ఈ పరిస్థితుల్లోనే కొంతమంది రైతులు పచ్చిగా ఉన్న మిర్చినే మార్కెట్‌కు తీసుకువస్తుండటంతో కనీస ధర కూడా దక్కడం లేదు.

మార్కెట్‌లోనూ ఇబ్బందులు..

ఎండుమిర్చి క్రయవిక్రయాలకు జిల్లాలో హిందూపురం వ్యవసాయ మార్కెట్ ప్రధాన వనరు. ఇక్కడి మార్కెట్‌కు ప్రతి మంగళ, శుక్రవారం హిందూపురం పరిసర ప్రాంతాలతో పాటు మడకశిర, గౌరిబిదనూరు, శిర, పావగడ, గోరంట్ల, కదిరి, పెనుకొండ ప్రాంతాల నుంచి రైతులు ఎండు మిర్చి తీసుకు వస్తుంటారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో తేమశాతం ఎక్కువగా ఉన్న సరుకే వస్తోంది. మార్కెట్‌లోనూ మిర్చి ఆరబెట్టేందుకు గానీ, ధరలు తక్కువ ఉన్న సమయంలో నిల్వ ఉంచుకునేందుకు గానీ గోదాములు లేవు. ఈ పరిస్థితుల్లో రైతులు ధర ఉన్నా... లేకున్నా మార్కెట్‌లో అమ్మడమో.. లేకపోతే వెనక్కు తీసుకెళ్లడమో చేస్తున్నారు. చాలా మంది వెనక్కుతీసుకెళ్తే రవాణా ఖర్చులు వస్తాయని మార్కెట్‌లో ఉన్నరేటుకు పంట ఇచ్చిపోతున్నారు. ఇక్కడి మార్కెట్‌లో కనీసం రెండు, మూడు రోజులు పంట నిల్వ చేసుకునేందుకు గోదాము ఉండి ఉంటే తమకు ఎంతో మేలు జరిగేదని రైతులు చెబుతున్నారు.

గత ఏడాదితో పోలిస్తే తగ్గిన ధర

హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో గత ఏడాది మిర్చి నాణ్యమైన సరకు(మొదటి రకం) రూ.22 వేల వరకు పలికింది. ప్రస్తుతం రూ. 7 వేలు తగ్గి క్వింటా రూ.15 వేలు మాత్రమే పలుకుతోంది. ఒక్కసారిగా ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 2020–21లో మార్కెట్‌కు 12,221 క్వింటాళ్ల మిర్చి రాగా, 2021–22లో 18,661 క్వింటాళ్లు, 2022–23లో 8,044 క్వింటాళ్లు, 2023–24లో 15,476 క్వింటాళ్లు వచ్చింది. గతంలో ధరలు కూడా ఆశాజనకంగా ఉండేవి. ప్రస్తుతం పరిస్థితి తారుమారైంది.

గుంటూరుతో పోలిస్తే క్వింటాకు రూ.3 వేలు తక్కువ..

గుంటూరు మిర్చి మార్కెట్‌తో పోలిస్తే హిందూపురం మార్కెట్‌లో క్వింటాకు మొదటి రకం మిర్చికి రూ.3 వేల తేడా కనిపిస్తోంది. ఈ నెల 21న గుంటూరు మార్కెట్‌లో మిర్చి మొదటి రకం రూ.18,600 వరకు పలుకగా, రెండో రకం రూ.8,500 వరకు ధర పలికింది. కానీ హిందూపురం మార్కెట్‌లో మొదటిరకం మిర్చి రూ.15,100 మాత్రమే పలికింది.

ఉల్లాస్‌ంగా నేర్చుకునేలా...

- నిరక్షరాస్యుల కోసం కేంద్ర ప్రభుత్వ పథకం
- వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో అమలు
- ఉమ్మడి జిల్లాలో 34,620 మంది లక్ష్యం
- ఈ నెల 17 నుంచి సర్వే చేస్తున్న వెలుగు సీసీలు, యానిమేటర్లు



వెలుగు సీసీలు, యానిమేటర్లకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: జాతీయ విద్యా విధానం -2020లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 'ఉల్లాస్' (అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 15 ఏళ్లు, అంతకంటే పైబడి ఉండి తమకు తాము చదువుకునే అవకాశం లేనివారికి సాధికారత కల్పించడం, దేశాభివృద్ధికి సహకరించేలా చేయడమే ఈ 'ఉల్లాస్' లక్ష్యం. చదవడం, రాయడం, సంఖ్యా నైపుణ్యాలను పొందడం మాత్రమే కాకుండా జీవితకాల అభ్యాసాన్ని ప్రోత్సహిస్తూ క్లిష్టమైన జీవిత నైపుణ్యాల అవగాహనతో వారిని మరింత మెరుగుపరచడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. డిజిటల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, చట్టపరమైన అక్షరాస్యతపైనా అవగాహన కల్పించనున్నారు. వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.


తొలివిడతలో 34,620 మంది..

తొలివిడతగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 34,620 మందికి అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం విధించింది. ఇందులో అనంతపురం జిల్లాలో 18,666 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 15,954 మందిని లక్ష్యంగా పెట్టుకున్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్‌వాడీ హెల్పర్స్, ప్రభుత్వ స్కూళ్లలోని ఆయాలు, వంట మనుషులు, ఉపాధి కూలీలకు అమలు చేయనున్నారు. అక్షరాస్యతలో వెనుకబడిన మండలాలనే ఎంపిక చేసుకున్నారు. జిల్లాలో శింగనమల, పెద్దవడుగూరు, డి.హీరేహాళ్, బొమ్మనహాళ్, నార్పల, బుక్కరాయసముద్రం, బ్రహ్మసముద్రం, గుమ్మఘట్ట, విడపనకల్లు, వజ్రకరూరు మండలాలు, శ్రీసత్యసాయి జిల్లాలో తాడిమర్రి, బత్తలపల్లి, గుడిబండ, అమడగూరు, నల్లమాడ, ఓడీ చెరువు, తలుపుల, గాండ్లపెంట, తనకల్లు, ఎన్‌పీ కుంట మండలాలను ఎంపిక చేశారు. ఇప్పటికే జిల్లాస్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించారు. అమలులో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని, ప్రభుత్వ లక్ష్యం చేరుకునేందుకు అందరూ కృషి చేయాలని కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు.

వెలుగు సీసీ, యానిమేటర్ల ద్వారా సర్వే..

ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పాత్ర కీలకంగా ఉంటుంది. 'ఉల్లాస్'లో భాగంగా ప్రస్తుతం వెలుగు సీసీలు, యానిమనేటర్ల ద్వారా ఎంపిక చేసిన మండలాల్లో సర్వే జరుగుతోంది. అభ్యాసకుల పేర్లు, మొబైల్ నంబరు, గుర్తింపుకార్డు, తండ్రి/ భర్త/ సంరక్షుడిపేరు, వృత్తి, వయసు, కులం, చిరునామా తదితర వ్యక్తిగత వివరాలను సేకరిస్తున్నారు. వీటన్నింటినీ 'ఉల్లాస్' యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇప్పటిదాకా 25 వేల మందిని సర్వే చేశారు. అమలు చేసే ప్రక్రియపై శుక్రవారం రాష్ట్రస్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఇందుకోసం జిల్లా నుంచి వయోజన విద్య, డీఆర్డీఏ అధికారులు హాజరయ్యారు.

మంచి కార్యక్రమం



'ఉల్లాస్' చాలా మంచి కార్యక్రమం. కేవలం చదవడం, రాయడమే కాకుండా డిజిటల్ లిటరసీ, ఫైనాన్షియల్ లిటరసీపైనా అవగాహన కల్పిస్తారు. చట్టాలపై అవగాహన కల్పిస్తారు. గ్రామీణ ప్రాంతాల వారికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. 29న జిల్లా స్థాయి, నవంబరు 2న మండలస్థాయిలో శిక్షణ ఉంటుంది. డీఆర్డీఏ, విద్యాశాఖ, పంచాయతీరాజ్, ఐసీడీఎస్ శాఖల సహకారంతో 'ఉల్లాస్'ను పూర్తిస్థాయిలో అమలు చేస్తాం.

– ఆంజనేయులు, డిప్యూటీ డైరెక్టర్, వయోజన విద్య

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ



నివేద్‌కుమార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో స్థానిక రుద్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ చాటాడు. అండర్-17 విభాగంలో అంకె నివేద్ కుమార్ (35 కిలోలు) బంగారు పతకాన్ని సాధించి నవంబర్‌లో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ప్రతిభ చాటిన విద్యార్థిని ఆ పాఠశాల హెచ్‌ఎం సుమంగళి, పీఈటీలు ఎం.అన్నపూర్ణ, ఎం. లావణ్య, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

చాగల్లు రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

పెద్దపప్పూరు: మండలంలోని చాగల్లు రిజర్వాయర్ నుంచి శుక్రవారం సాయంత్రం 200 క్యూసెక్కుల నీటిని పెన్నానదికి వదిలారు. అలాగే కుడి కాలువ ద్వారా మరో 300 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న పెండేకల్లు రిజర్వాయర్‌కు వదిలారు. ఈ మేరకు హెచ్చెల్సీ జేఈ హరి తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం



వృద్ధురాలిని విచారిస్తున్న పోలీసులు, స్థానికులు

కణేకల్లు: జీవితంపై విరక్తితో చెరువులో దూకిన వృద్ధురాలిని స్థానికులు కాపాడి పోలీసుల ద్వారా కుటుంబసభ్యుల చెంతకు చేర్చారు. వివరాలు... డి.హీరేహళ్ మండలం దొడగట్ట గ్రామానికి చెందిన వన్నూరమ్మ (80) భర్త హనుమంతప్ప 11 నెలల క్రితం మృతి చెందాడు. ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. కొడుకుల వద్దనే ఆమె ఉంటోంది. వయసు మీద పడడంతో అనారోగ్య సమస్యలు తలెత్తాయి. దీంతో శుక్రవారం ఉదయం 11.30 గంటలకు కణేకల్లు చెరువులో దూకింది. చెరువు కట్టపై గస్తీ చేస్తున్న లస్కర్ మల్లికార్జున గమనించి వెంటనే అక్కడున్న కొందరు యువకుల సాయంతో ఆమెను కాపాడి గట్టుకు చేర్చి పోలీసులకు అప్పగించారు. విచారణ అనంతరం కుటుంబసభ్యులను రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ నాగమధు పిలిపించి, కౌన్సెలింగ్ అనంతరం వృద్ధురాలిని అప్పగించారు.

ఉల్లికల్లు వాసులపై కేసు కొట్టివేత

శింగనమల: మండలంలోని ఉల్లికల్లు వాసులపై 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నమోదు చేసిన కేసును కొట్టి వేస్తూ శుక్రవారం జిల్లా సెకండరీ స్పెషల్ మెజిస్ట్రేట్ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. అప్పట్లో ముంపు పరిహారం చెల్లించడంలో టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో నాయనపల్లి క్రాస్‌లో ఉల్లికల్లు గ్రామస్తులు ధర్నా చేశారు. దీంతో 26 మందిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు కేసు బనాయించారు. కేసులో ఆలూరు సాంబశివారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, పరంధామరెడ్డి, శ్రీరామరెడ్డి, శివరామేశ్వర రెడ్డి, బాలరంగయ్య, చిన్న శివారెడ్డి, నారాయణస్వామి, క్రిష్టారెడ్డి, నగేష్, రామాంజినేయులు, వెంకటనారాయణ, శంకర్‌రెడ్డి, ఆదినారాయణ, చెన్నకేశవులు, శివారెడ్డి, చౌడప్ప, మల్లికార్జున, బాబుల్‌రెడ్డి, ప్రేమనాథ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, దేవేంద్రనాథ్ రెడ్డి, చౌడయ్య, నాగభూషణం ఉన్నారు. ఇందులో ఇద్దరు మృతి చెందడంతో 24 మంది కేసులో ఉన్నారు. ఈ కేసు వాదనలు దాదాపు ఏడేళ్ల పాటు కొనసాగుతూ వచ్చాయి. శుక్రవారం తుది తీర్పును న్యాయమూర్తి వెలువరించారు.

హన్నా... గెలుపు మిన్న



పట్టుమని 200 కుటుంబాలు నివాసమున్న గ్రామం. నగర శివారులో ఉన్నా... కాంక్రీట్ జంగిల్ పోకడలు కనిపించవు. పదో తరగతి వరకూ గ్రామంలో బేల్దారి పనులు, నగరంలో పండ్ల విక్రయంతో తల్లిదండ్రులకు చేదోడు. చిరుప్రాయం నుంచే శారీరక మార్పులతో సహ విద్యార్థుల చిన్న చూపు. వ్యక్తి వెనుక సూటిపోటి మాటలు... అవమానకర వ్యాఖ్యలు.

కట్ చేస్తే..

ప్రస్తుతం స్పెయిన్ దేశంలో ఫార్మా రంగ శాస్త్రవేత్త... ట్రాన్స్‌ఫ్యూజన్ శస్త్రచికిత్స తర్వాత ప్రపంచ దేశాలు గుర్తించేలా మిస్ వరల్డ్ ట్రాన్స్ రన్నరప్.. స్ఫూర్తిదాయక జీవనంతో పలువురికి ఆదర్శం. నవంబర్‌లో మిస్ యూనివర్స్ ట్రాన్స్ విజేత దిశగా అడుగులు.

... ఇది అనంతపురం జిల్లాకు చెందిన ట్రాన్స్‌జెండర్ హన్నా రాథోడ్ విజయ ప్రస్థానం. చదువుతో ఆమె సాధించిన ఒక్క గెలుపు కుటుంబాన్నే కాదు.. ఏకంగా జిల్లా కీర్తిప్రతిష్టలను పెంచింది. స్ఫూర్తిదాయకమైన ఆమె జీవనం ఆమె మాటల్లోనే... – అనంతపురం

- ఆత్మవిశ్వాసంతోనే అసాధారణ స్థాయికి
- స్పెయిన్‌లో శాస్త్రవేత్తగా రాణింపు
- 2023లో 'మిస్ వరల్డ్ ట్రాన్స్' పోటీల్లో రన్నరప్
- నవంబర్‌లో మిస్ యూనివర్స్ ట్రాన్స్ పోటీలకు సిద్ధం
- హన్నా రాథోడ్ స్ఫూర్తిదాయక ప్రస్థానం



హన్నా రాథోడ్

స్ఫూర్తి

మాది అనంతపురం రూరల్ పరిధిలోని సోములదొడ్డి గ్రామం. నాన్న మల్లేష్, అమ్మ పద్మావతికి మూడో సంతానంగా పుట్టాను. ఓ అన్న, అక్క ఉన్నారు. నాకు ఆనంద్‌బాబు అని పేరుపెట్టారు. అమ్మ, నాన్న అనంతపురం నగరంలోని తాడిపత్రి బస్టాండ్‌లో పండ్ల వ్యాపారం చేసేవారు. పేదరికం కారణంగా పస్తులతో గడిపిన రోజులెన్నో చూశా. దీంతో బడికి వెళ్లే సమయంలోనే ఏ మాత్రం వీలు చిక్కినా ఊళ్లో కూలి పనులకు, అమ్మ, నాన్నతో కలసి పండ్ల వ్యాపారం చేస్తూ వచ్చా. ఆరేళ్ల వయసులో ఉన్నప్పుడు నాలో శారీరక మార్పులు గుర్తించా. సమాజానికి తెలిస్తే బయటకు గెంటేసి హేళన చేస్తారేమోనని భయపడ్డా. దీంతో ఎవరితోనూ చెప్పుకోలేదు. చిన్న కొడుకు కావడంతో మా అమ్మ నన్ను ఎంతో గారాబంతో పెంచుతూ వచ్చింది.

నా వెనుక గేలి చేసేవారు

సమాజంలో ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న వివక్ష నన్ను చాలా భయపెట్టేది. ఇలాంటి సమయంలో కేవలం చదువు ఒక్కటే నా సమస్యకు చక్కటి పరిష్కారమని గుర్తించాను. దీంతో పట్టుదలగా చదువుకుంటూ క్లాస్‌లో టాపర్‌గా నిలుస్తూ వచ్చా. ఇంటర్ వరకూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో తెలుగు మీడియం చదివిన నేను ఆ తర్వాత అనంతపురంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బీ-ఫార్మసీ చేశా. అక్కడ చాలా మంది స్నేహితులు ఉండేవారు. వారిలో కొందరు నా ముందు ఏమీ అనకపోయినా... నా వెనుక చెడుగా మాట్లాడుకునేవారని తెలిసి బాధపడ్డాను. జన్యుపరమైన లోపాన్ని ఎవరూ గుర్తించలేదు. గేలి చేసినా కుంగిపోలేదు. పట్టుదలతో బీ-ఫార్మసీ, ఎం-ఫార్మసీ పూర్తి చేశా.

పెళ్లి ప్రయత్నాల నుంచి బయటపడి

ఎం-ఫార్మసీ పూర్తి చేసిన తర్వాత విదేశాల్లో ఎంఎస్ చేయాలని అనుకున్నా. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించలేదు. దీంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా రెండేళ్ల పనిచేశా. అదే సమయంలో జూనియర్ ఫార్మసీ విద్యార్థులకు ట్యూషన్లు చెప్పడం ద్వారా వచ్చిన డబ్బును దాచుకుని విదేశీ విద్యావకాశాలపై అన్వేషిస్తూ వచ్చా. ఈ లోపు అనంతపురం కలెక్టరేట్‌లో ఉద్యోగం వచ్చింది. ఈ విషయం తెలియగానే చాలా మంది అమ్మాయిని ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. అయితే పెళ్లి చేసుకుని ఆమె జీవితాన్ని నాశనం చేయకూడదని భావించిన నేను... విదేశాలకు వెళ్లిపోతే పెళ్లి ప్రయత్నాలు వాయిదా పడతాయనుకున్నా. అదే సమయంలో విదేశీ విద్యావకాశాలపై అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్ష రాసి మెరుగైన ఫలితాలతో స్పెయిన్‌లో ఎంఎస్ సీటు దక్కించుకున్నా. కోర్సు పూర్తి కాగానే అక్కడే బయో ఇంజినీరింగ్ సొల్యూషన్స్‌లో శాస్త్రవేత్తగా పనిచేసే అవకాశం వచ్చింది. శాస్త్రవేత్తగా స్థిరపడిన తర్వాత 2021లో ట్రాన్స్‌ఫ్యూజన్ ఆపరేషన్ చేయించుకుని హన్నారాథోడ్‌గా పేరు మార్చుకుని ఇంట్లో వారికి విషయం చెప్పా.

చదువే సెలబ్రిటీని చేసింది

ట్రాన్స్‌జెండర్ల జీవితం ఎప్పుడూ సాఫీగా ఉండదు. మన వ్యక్తిత్వం చెదరకుండా కాపాడుకోవాలి. ఎలాంటి వ్యక్తికైనా ప్రతికూల కాలమంటూ ఉంటుంది. నిరాటంకంగా అవరోధాల్ని అధిగమించి విజయం సాధిస్తే ఈ సమాజమే గౌరవప్రదంగా చూస్తుంది. మనం కోరకుండానే వచ్చే జన్యుపరమైన లోపాలకు కుంగిపోరాదు. ఆత్మస్థైర్యాన్ని కోల్పోయి, ధర్మాన్ని, దైవాన్ని నిందించడం కూడా పొరబాటే. అసలు ప్రతికూలతల్లో కూడా అనుకూలతను వెదికి అనుకూలంగా మలచుకునే యుక్తిని సాధించగలగాలి. అప్పుడే విజయం మన సొంతమవుతుంది. నా జీవితమే ఇందుకు నిదర్శనం. చదువే నన్నున్న సెలబ్రిటీని చేసింది. ఈ స్థాయికి నేను ఎదగడంలో ఎదుర్కొన్న కష్టాలు, బాధలు వివరిస్తూ తెలుగు, ఇంగ్లిష్, స్పానిష్ మూడు భాషల్లో పుస్తకం రచిస్తున్నా. త్వరలో ఈ పుస్తకాన్ని మీ ముందుకు తీసుకువస్తా.

మిస్ వరల్డ్ పోటీల్లో ప్రతిభ



గతేడాది స్పెయిన్ రాజధాని మాడ్రిడ్‌లో మిస్ వరల్డ్ ట్రాన్స్-2023 పోటీలు జరిగాయి. అక్కడే పనిచేస్తున్న నాకు ఈ విషయం తెలిసి భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు దరఖాస్తు చేసుకున్నా. దీంతో నిర్వాహకులు అవకాశం ఇచ్చారు. ఈ పోటీలో ఏకంగా రన్నరప్‌గా నిలవడంతో నాలో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. దీంతో సేవా కార్యక్రమాలు చేపట్టి ట్రాన్స్ సమాజంలో సమూల మార్పులు తీసుకురావాలని భావించాను. ఆ దిశగా తొలి ప్రయత్నం చేశాను. ఇందు కోసం స్పెయిన్‌లోని కొన్ని కంపెనీలతో సంప్రదింపులు కూడా జరిపాను. ట్రాన్స్ సమాజంలో దుర్భర జీవితం గడుపుతున్న వారి సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తామని కంపెనీ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ ఏడాదికి సంబంధించి నవంబర్‌లో న్యూఢిల్లీలో మిస్ యూనివర్స్ ట్రాన్స్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కింది. ఈ పోటీల్లో పాల్గొనడానికే ఇండియాకు వచ్చా. ఇక్కడ మా ఊరి ప్రజలు నన్ను చూసి చాలా సంతోషపడ్డారు. ప్రతి ఒక్కరూ నన్ను ఆశీర్వదించారు. ఇక్కడ ఏ కార్యక్రమం జరిగినా నేనే చీఫ్ గెస్ట్. ఇంతకంటే గౌరవం ఏమి కావాలి?



రోడ్డు ప్రమాదాలు నివారించాలి

- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్ (చిత్రంలో) ఎస్పీ జగదీష్

అనంతపురం అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ పి.జగదీష్‌తో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్లాక్ స్పాట్‌ల వద్ద లైటింగ్, బోర్డులు, సూచికల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. హెల్మెట్ ధరించిన ద్విచక్ర వాహనదారులను గుర్తించి నగదు అవార్డు ప్రకటిస్తే... హెల్మెట్‌ధారణను ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు. స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నగరంలో 40 సీసీ కెమెరాలు ఏర్పాటుకు టెండర్లను ఇప్పటికి రెండు సార్లు పిలిచినా ఎవరూ ముందుకు రాలేదని కలెక్టర్ దృష్టికి నగర పాలక సంస్థ అధికారులు తీసుకొచ్చారు. దీంతో మరోసారి టెండర్లు పిలవాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే 4మెగా పిక్సల్‌తో పనిచేస్తున్న 125 సీసీ కెమెరాలను 8 మెగా పిక్సల్‌గా అప్‌డేట్ చేయాలన్న పోలీసు శాఖ ప్రతిపాదన మేరకు చర్యలు చేపట్టి వారంలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో డీటీసీ వీర్రాజు, ఆర్‌టీసీ ఆర్‌ఎం సుమంత్, ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌ఓ ఈబీదేవి, డీఎస్పీలు, ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర ఉచిత పంటల బీమా అమలు చేయాలి

- ఏపీ రైతు సంఘం డిమాండ్

అనంతపురం అర్బన్ : ఈ రబీ, వచ్చే ఖరీఫ్ సీజన్‌లకు కూటమి సర్కార్ ప్రకటించిన పంటల బీమా నూతన విధానం రైతులకు నష్టం చేకూరుస్తుందని, భాగస్వామ్యం పేరుతో రైతులపై భారం మోపడం సరికాదని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సమగ్ర ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంటల బీమా కొత్త విధానం ప్రైవేటు బీమా కంపెనీలకు లాభదాయకంగానూ... రైతులకు నష్టదాయకంగా ఉందని విమర్శించారు. గతంలో బ్యాంకుల్లో పంట రుణం తీసుకున్న రైతులకు బీమా ప్రీమియాన్ని రుణం మొత్తం నుంచి మినహాయించుకుని రైతుల వాటా కింద బ్యాంకులే చెల్లించే విధానం అమలులో ఉండేదన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించిన విధానంలో రైతులు సొమ్ము చెల్లించాల్సి వస్తోందన్నారు. ఈ లెక్కన వరికి హెక్టారుకు రూ.1,575, పప్పుశనగకు రూ.1,125, వేరుశనగకు రూ.1,200, మొక్కజొన్నకు రూ.1,313, టమాటకు రూ.4 వేలు బీమా ప్రీమియంను రైతులు చెల్లించాలని ప్రకటించడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. కొత్త విధానంపై పునఃపరిశీలన చేసి రైతులకు లాభదాయకమైన సమగ్ర ఉచిత పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

యాడికి: తండ్రిని హతమార్చిన కేసులో కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. వివరాలను సీఐ ఈరన్న వెల్లడించారు. మండలంలోని వీరన్నపల్లికి చెందిన వడ్రా లక్ష్మీనారాయణ పెద్ద భార్య వరలక్ష్మి కుమారుడు కార్తీక్... ఈ నెల 23న మధ్యాహ్నం యాడికిలో తన తండ్రిని హతమార్చిన విషయం తెలిసిందే. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం ఉదయం కమలపాడు రహదారిలో ఉన్న కార్తీక్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు. పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తిని పంపకాలు చేసివ్వలేదన్న అక్కసుతో తండ్రిని హతమార్చినట్లుగా నిర్ధారణ అయింది. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఏటీఎంలో చోరీకి యత్నించిన దుండగుల అరెస్ట్

నార్పల: స్థానిక కూతలేరు వంక సమీపంలో ఈ నెల 18న ఏటీఎంలో చోరీకి యత్నించిన దుండగులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను డీఎస్పీ వెంకటేశులు, సీఐ కౌలుట్లయ్య వెల్లడించారు. నార్పలలోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద శుక్రవారం ఉదయం అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఓ మహిళ, నలుగురు వ్యక్తులను స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ సాగర్, సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. పోలీసులను చూడగానే వారు పారిపోతుండడంతో వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో జిల్లాలో పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లుగా నిర్ధారణ అయింది. ఈ క్రమంలోనే ఈ నెల 18న నార్పలలో ఏటీఎం చోరీకి ప్రయత్నించినట్లుగా వారు అంగీకరించారు. పట్టుబడిన వారిలో బోయ చిన్నబాబు, సాకే చిన్న, ఎరికల అంజలి, గొర్ల శంకర్, బోయ సాయి ఉన్నారు. వీరి నుంచి ఓ ఆటో, ఐదు ద్విచక్ర వాహనాలు, పలు ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

ఆకట్టుకున్న పోలీసు ఆయుధాల ప్రదర్శన



ఆయుధాల ప్రదర్శనలో ఎస్పీ జగదీష్

అనంతపురం: విధుల్లో భాగంగా పోలీసులు వినియోగించే పలు ఆయుధాలు, సాధనాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ పి.జగదీష్ అభిప్రాయపడ్డారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా డీపీఓలోని షాదీఖానాలో శుక్రవారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీసులు వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, ఇతర ఉపకరణాలను ప్రదర్శించారు. సందర్శనకు విచ్చేసిన ప్రజలకు వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అనంతపురం డీఎస్పీ వి. శ్రీనివాస రావు, త్రీటౌన్ సీఐ శాంతిలాల్, ఆర్‌ఐలు రెడ్డప్పరెడ్డి, రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 'సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర' అంశంపై వ్యాసరచన నిర్వహించారు.



ఓపెన్ హౌస్‌లో విద్యార్థుల సందడి





పోలీసు జాగిలంతో సరదాగా..., వైర్‌లెస్ సెట్‌లో మాట్లాడుతున్న విద్యార్థిని

'ముద్ద' వ్యాధిపై అప్రమత్తం

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం అగ్రికల్చర్: పశువుల్లో ముద్ద చర్మవ్యాధి ప్రబలకుండా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు ఉభయ జిల్లాల పశుసంవర్ధకశాఖ జేడీలు డాక్టర్ జీపీ వెంకటస్వామి, డాక్టర్ శుభదాస్, స్థానిక పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ డాక్టర్ ఎస్.రామచంద్ర తెలిపారు. 'కబలిస్తున్న ముద్ద వ్యాధి' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆ శాఖ జేడీలు, ఏడీ స్పందించారు. 2022 పరిస్థితులు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకున్నామన్నారు. అనంతపురం జిల్లాలో 2.37 లక్షలు, శ్రీసత్యసాయి జిల్లాలో 2.89 లక్షల గోట్‌ఫాక్స్ వ్యాక్సినేషన్ పశువులకు ఇచ్చామన్నారు. అక్కడక్కడ ఒకటి అరా కనిపిస్తున్నా... వ్యాధి ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యాధిని సమూలంగా నివారించేలా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

అనంతపురం అర్బన్: గిట్టుబాటు ధరతో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కూటమి సర్కార్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. కల్తీ విత్తనాలు, పురుగు మందుల కారణంగా ఇప్పటికే రైతులు చాలా నష్టపోయారన్నారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారం క్రితం పత్తి క్వింటా ధర రూ. 8,500 ఉండగా, ప్రస్తుతం రూ.6,500కు పడిపోయిందన్నారు. ప్రభుత్వం రూ.7,250 మద్దతు ధర ప్రకటించినా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారుల మోసాలు పెరిగిపోయాయన్నారు. మద్దతు ధర ప్రకటించి అమలు అంశాన్ని పక్కన పెట్టడం రైతులను దగా చేయడానికేనని విమర్శించారు. తక్షణమే జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

అల్లుకున్న నిర్లక్ష్యం..

రాప్తాడు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు పిచ్చి మొక్కల తీగలు అల్లుకుపోయాయి. హైటెన్షన్, లోటెన్షన్ వైర్లను చుట్టుముట్టేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని గొల్లపల్లి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై వాహనాలకు విద్యుత్ తీగలు తగలకుండా రోడ్డుకు అటు వైపు.. ఇటు వైపు రెండు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. గొల్లపల్లి గ్రామం వైపు ఉన్న విద్యుత్ పోల్‌ను పిచ్చి మొక్కల తీగలు చుట్టుముట్టేశాయి. ఆ పోల్ సమీపంలోనే మరొక పోల్‌కు కూడా పిచ్చి మొక్కల తీగలు అల్లుకున్నాయి. అలాగే మండలంలోని బొమ్మేపర్తి గ్రామ సమీపంలో వ్యవసాయ పొలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను తీగలు పందిరిలా కప్పేశాయి. వర్షాకాలంలో గాలి దుమారం, విద్యుత్ లైన్‌కు చెట్ల కొమ్మలు తగిలి నిప్పు రవ్వలు ఎగిసి పడుతున్నాయని స్థానికులు, రైతులు చెబుతున్నారు. పశువులు మేతకు వెళ్లినప్పుడు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోక ముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తీగలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

– రాప్తాడు:



గొల్లపల్లి సమీపంలో పెద్ద విద్యుత్ స్తంభానికి దట్టంగా అల్లుకుపోయిన తీగలు



గొల్లపల్లి వద్ద విద్యుత్ పోల్‌కు అల్లుకున్న తీగలు



బొమ్మేపర్తి గ్రామ సమీపంలోని వ్యవసాయం పొలంలో ఇలా..



లింగనపల్లి సమీపంలో ప్రమాదకరంగా..

క్లుప్తంగా

అర్బన్ మార్కెట్ ప్రారంభం

అనంతపురం ఎడ్యుకేషన్: నగరపాలక సంస్థ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరరావు, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మేయర్ వసీం శుక్రవారం ప్రారంభించారు. మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులు, వృత్తి వ్యాపార వస్తువులు, తిను బండారాలు, చేతి ఉత్పత్తులు ఈ అర్బన్ మార్కెట్‌లో విక్రయిస్తారు. మహిళా సంఘాల సభ్యులు తయారు చేస్తున్న ఉత్పత్తులను నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కమిషనర్ జి.నాగరాజు, మెప్మా పీడీ జే.విశ్వజ్యోతి, నగరపాలక సంస్థ అధికారులు, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర శాఖ, పోలీస్ శిక్షణ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నూతన చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ మల్లికార్జున వర్మ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రాచీన చట్టాలు, నూతన చట్టాలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను కూలంకషంగా వివరించారు. విద్యార్థినులు, మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, వాటిని ఏ విధంగా ఉపయోగించుకోవాలో సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సంగీత తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత, ఇన్‌స్పెక్టర్ ప్రతాపరెడ్డి, అధ్యాపకులు మహమ్మద్ షఫీ, డాక్టర్ సి.రామాంజనేయులు, డాక్టర్ వై.అంజనరెడ్డి పాల్గొన్నారు.

సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



గౌతమ్‌ను అభినందిస్తున్న ఎస్‌ఎస్వీ కళాశాల వైస్ చైర్మన్, ప్రిన్సిపాల్ తదితరులు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి గౌతమ్ సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమలో విద్యార్థిని కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శ్రీనివాసులు, ఏఓ శ్రీనాథ్, వ్యాయమ అధ్యాపకులు ఎం.శ్రీనివాసులు అభినందించారు. ఈనెల 17న ఎస్కేయూ ఇంటర్ కళాశాల బ్యాడ్మింటన్ టోర్నీలో గౌతమ్ సత్తాచాటాడు. ఈనెల 26 నుంచి 29 వరకూ తమిళనాడు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వేదికగా జరిగే అంతర్ వర్శిటీ సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటాడని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

లిక్కర్ డిపో మేనేజర్‌గా డాక్టర్ బి.నాయుడు

అనంతపురం: లిక్కర్ డిపో మేనేజర్‌గా డాక్టర్ బి.నాయుడు నియమితులయ్యారు. అనిమల్ హస్బెండరీ విభాగంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్‌గా ఉన్న బి.నాయుడును ఫారిన్ సర్వీసు కింద లిక్కర్ డిపోకు బదిలీ చేశారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

బాల్య వివాహాలను అరికడదాం



బాల్య వివాహాలను ఆపాలని చేతుల మీద రాసుకుని చూపుతున్న విద్యార్థినులు

ఆత్మకూరు: బాల్య వివాహాలను అరికడదామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని మదిగుబ్బ, ముట్టాల, తలుపూరు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతి, ఇంటర్ చదువుకునే వయసులోనే పెళ్లిళ్లు చేసుకోరాదని తెలిపారు. బాల్య వివాహాలు చేసినా.. ప్రోత్సహించినా చట్టరీత్యా శిక్ష పడుతుందని తెలిపారు. విద్యార్థినులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. మహిళా పోలీసులు, వీఆర్వోలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్ట్ షాప్ సీజ్

అనంతపురం: నగరంలోని సంగమేష్ సర్కిల్ వద్ద ఉన్న లేపాక్షి పార్కు వద్ద బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న రామాంజనేయులు అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపారు. అక్రమంగా నిర్వహిస్తున్న మద్యం షాపును సీజ్ చేసి, 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. బెల్టు షాపులు ఎక్కడైనా నిర్వహిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

గ్రామీణ ప్రాంతాల్లో సేవలందించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం మెడికల్: పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు సేవలందించాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి వైద్య కళాశాలలో పీజీ విద్యార్థులు ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతి పీజీ విద్యార్థికి రూ.3 కోట్ల వరకు ఖర్చు చేస్తుందన్నారు. కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లా ప్రజలకు సేవలందించేలా కార్యాచరణ చేసుకోవాలన్నారు. కళాశాల అభివృద్ధికి ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. పీజీ విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లాలన్నారు. మూడేళ్ల పాటు పట్టుదల, ఇష్టంతో విద్యనభ్యసించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ మధు, డాక్టర్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

అనాటమీ సబ్జెక్టును క్షుణ్ణంగా తెలుసుకోండి



మాట్లాడుతున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు

అనంతపురం ఎడ్యుకేషన్: అన్ని దానాలకంటే శరీర దానం (దేహదానం) గొప్పదని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్యరావు తెలిపారు. శుక్రవారం వైద్య కళాశాల అనాటమీ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి ఆచార్య డాక్టర్ ఎస్.ఉమామహేశ్వర రావు ఆధ్వర్యంలో కెడావర్ ఓత్ (శవ ప్రమాణం) కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. చనిపోతూ కూడా వైద్య విద్యార్థులు చదువుకోవడానికి మానవ అంతర్నిర్మాణ శాస్త్రాన్ని తెలుసుకోవడానికి తన దేహం ఉపయోగపడుతుందని భావించి తృణప్రాయంగా దానం చేయడం గొప్ప విషయమన్నారు. దాతలకు ఇందుకు సహకరించిన వారి కుటుంబ సభ్యులు, సహకరిస్తున్న స్వచ్ఛంద సంస్థలకు మెడికల్ కళాశాల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. వైద్య విద్యార్థులు అనాటమీ సబ్జెక్టును చాలా క్షుణ్ణంగా తెలుసుకోవాలని పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన ఆదర్శవంతమైన ఉపాధ్యాయులు ఈ డిపార్ట్‌మెంట్‌లో ఉండటం విద్యార్థుల అదృష్టమన్నారు. వారి నుంచి అపారమైన జ్ఞానాన్ని సముపార్జన చేసుకోవాలని సూచించారు. మనకు దానం చేసి నేర్చుకోవడానికి ఉపయోగపడే శవాన్ని పవిత్రంగా చూడాలన్నారు. అనాటమీ నేర్చుకోవడానికి శవమే తొలి గురువు అని తెలిపారు. దేహదానానికి తమ వంతు సహాయం అందిస్తున్న సంజీవిని ట్రస్ట్ అధ్యక్షుడు రమణారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ నవీన్, డాక్టర్ శంషాద్ బేగం, డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ మధుసూదన్, ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్, అనాటమీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నరేంద్ర నాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పద్మజ, ట్యూటర్లు పునర్జీవన్ కుమార్, భాను, సంజీవిని పాల్గొన్నారు.

అనుమతి లేకుండా లే అవుట్లు వేస్తే చర్యలు



వడ్డుపల్లి వద్ద వేసిన లే అవుట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మీనాయక్

ఆత్మకూరు: వడ్డుపల్లి గ్రామం వద్ద అనుమతులు లేకుండా లే అవుట్లు వేసిన వారికి నోటీసులు ఇవ్వాలని తహసీల్దార్ లక్ష్మీనాయక్ పంచాయతీ, రెవెన్యూ అధికారులకు సూచించారు. శుక్రవారం వడ్డుపల్లి వద్ద అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన లే అవుట్లను పరిశీలించారు. అగ్రికల్చర్ నుంచి నాన్ అగ్రికల్చర్ కింద మార్చుకున్న లే అవుట్లు రెండు మాత్రమే ఉన్నాయని తెలిపారు. కేవలం ఇద్దరు మాత్రమే అనుమతి తీసుకున్నారని.. మిగిలిన వారు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. పంచాయతీ అనుమతి లేకుండా లే అవుట్లు వేసిన కొంత మందికి ఇప్పటికే పంచాయతీ ద్వారా నోటీసులు అందజేశామన్నారు. అంతేకాకుండా అనుమతులు తీసుకోకుండా వేసిన లే అవుట్ల వివరాలు కూడా అహుడా దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోవాలని కోరినట్లు పంచాయతీ అధికారులు తెలిపారు. అనంతరం వడ్డుపల్లి వద్ద ఎన్ని లే అవుట్లు వేశారు? వాటిలో ఎన్నింటికి అనుమతులు తీసుకున్నారు? అనుమతి తీసుకోని లే అవుట్ల వివరాలను తహసీల్దార్ అడిగి తెలుసుకున్నారు. లే అవుట్లు వేసే వారు తప్పకుండా పంచాయతీ, రెవెన్యూ అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో వీఆర్వో ప్రసాద్, పంచాయతీ సెక్రటరీ సునీయాస్ పాల్గొన్నారు.

'న్యాయవాదులు ఆత్మస్థైర్యం కోల్పోకూడదు'



ఎస్కేయూలో ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం: జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవాలి. ఆత్మవిశ్వాసంతో వృత్తిలో స్థిరపడాలని జడ్జీలు పేర్కొన్నారు. యువ న్యాయవాది రుక్సానా మృతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం రుక్సానా చిత్రపటానికి నివాళులర్పించారు. న్యాయవాది వృత్తిలోకి ప్రవేశించిన వెంటనే అనేక రకాల ఒత్తిడి ఎదుర్కోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే సీనియర్లకు చెప్పుకుని మనోనిబ్బరంతో కొనసాగాలని సూచించారు. రుక్సానా మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో జడ్జీలు సత్యవాణి, శోభారాణి, శివప్రసాద్ యాదవ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గురుప్రసాద్, సీనియర్ న్యాయవాదులు ఎల్.ప్రభాకర్ రెడ్డి, బడా నారాయణ రెడ్డి , హనుమన్న తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సంక్షేమం పట్టని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

నిరుద్యోగుల సంక్షేమం పట్టకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ నాయకులు విమర్శించారు. యువన్యాయవాది రుక్సానా మృతి బాధాకరమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుకు నిరసనగా ఎస్కేయూ ప్రధాన ద్వారం వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమణయ్య మాట్లాడారు. రాష్ట్రంలోని వర్సిటీల్లో పీజీ, పీహెచ్‌డీలు, ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన వారికి ఉపాధి లభించడం లేదన్నారు. సరైన ఉపాధి లభించక పోవడంతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఓ వైపు నిరుద్యోగం పెరిగిపోతున్నా.. రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ న్యాయవాదులకు ఇచ్చే స్టైఫండ్‌ను రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామని చెప్పిన చంద్రబాబు నాయుడు తక్షణమే అమలు చేయాలని కోరారు. జూనియర్ న్యాయవాది మృతిపై ఉన్న అనుమానాలను నివృత్తి చేసి, రుక్సానా కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

- జిల్లా మలేరియా అధికారి ఓబులు



దోమల మందు పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

రాప్తాడు: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పండమేరు వంక ఉధృతంగా ప్రవహించిన విషయం తెలిసిందే. శుక్రవారం మండలంలోని కళాకారుల కాలనీ, బృందావన కాలనీ, దండోర కాలనీల్లో వైద్యాధికారి శివ కృష్ణ ఆధ్వర్యంలో జిల్లా మలేరియా అధికారి ఒబులు పర్యటించారు. బ్లీచింగ్ పౌడర్, క్రిమి సంహారక మందులు పిచికారీ చేయించారు. మెడికల్ క్యాంప్, ఇంటింటా ఫీవర్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో తిరిగి విషజ్వరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రోగులు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ వైద్యంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయన్నారు. పరిసరాల అపరిశుభ్రతతో రోగాల వ్యాపిస్తున్నాయని పేర్కొన్నారు. దోమకాటు వలన విషజ్వరాలు విజృంభిస్తున్నాయని.. దోమకాటుకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకునేలా చూడాలన్నారు. ప్రజలు కూడా కాచి చల్లార్చిన నీటిని తాగాలని తెలిపారు.

'మేవా' రాష్ట్ర మహాసభకు తరలి రండి

అనంతపురం కల్చరల్: ఆల్ మేవా (ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్) రాష్ట్ర వార్షిక మహాసభను జయప్రదం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర సహాధ్యక్షుడు వై.ఫక్రుద్దీన్, జిల్లా అధ్యక్షుడు షేక్షావలి, ప్రధాన కార్యదర్శి ఫరూఖ్ మహ్మద్ మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008 సంవత్సరంలో ఆల్ మేవా సంస్థ ఆవిర్భవించిందని తెలిపారు. మైనార్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 27న నంద్యాలలోని నేషనల్ పీజీ కాలేజ్ వేదికగా రాష్ట్ర వ్యాప్త మహాసభ జరుగుతుందన్నారు. అన్ని జిల్లాల నుంచి ముస్లింలే కాకుండా క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధ ఉద్యోగులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మైనార్టీ సంక్షేమ మంత్రితో పాటూ పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థల ప్రతినిధులు, సామాజిక సేవా ప్రముఖులు ముఖ్య అతిథులుగా విచ్చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో హిదయతుల్లా, జిలాన్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

క్రీడా కోర్టుల ఏర్పాటుకు చర్యలు

ఆత్మకూరు: స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో క్రీడా కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడా కోర్టుల ఏర్పాటుకు సంబంధించి జరుగుతున్న మట్టి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'పీఎంశ్రీ' పథకంలో భాగంగా రూ.లక్ష నిధులతో త్రోబాల్ కోర్టు, టెన్నీ కాయిట్ కోర్టు, కబడ్డీ కోర్టుల ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే పాఠశాలలో 'పీఎంశ్రీ' పథకంలో భాగంగా రూ.15 లక్షలతో కెమిస్ట్రీ ల్యాబ్ కూడా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన నిధులు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయని వెల్లడించారు.

దుప్పట్ల పంపిణీ

అనంతపురం కల్చరల్: ఇటీవల కురిసిన వర్షాలకు సర్వస్వం కోల్పోయిన 70 కుటుంబాలకు శుక్రవారం సాయంత్రం రేమా చర్చి వారు పాస్టర్ మనుష్యే ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ల సంక్షేమ సంఘం ప్రతినిధి పాస్టర్ జీఆర్ ఆనంద్ మాట్లాడుతూ.. మానవ సేవే మాధవ సేవ అన్నారు. అందరూ సేవ చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. అంతకు ముందు రేమా ప్రార్థనా మందిరంలో సామూహిక ప్రార్థనలు జరిగాయి. కార్యక్రమంలో శ్రీనివాసులు, ప్రసన్న, బాలరాజు, ఏఎస్ఐ బ్రదర్ ఈటె ఇజ్రాయిల్, బ్రదర్ సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అమరవీరుల త్యాగం వెలకట్టలేనిది'

రాప్తాడు: అమరవీరుల త్యాగం వెలకట్టలేనిదని సీఐ టీ.వి.శ్రీహర్ష తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఓపెన్ హౌస్ నిర్వహించారు. పోలీసులు నిత్యం విధుల్లో వినియోగించే వివిధ రకాల ఆయుధాలు, పరికరాలు, సాధనాలను ప్రదర్శనలో ఉంచారు. సుశిక్షితులైన సిబ్బందితో పోలీసు విధులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎఫ్ఐఆర్ నమోదు, రికార్డుల నిర్వహణపై క్షుణ్ణంగా వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రస్తుతం విద్యార్థులు చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ రంగాలు ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. ప్రజలకు సేవ చేసేందుకు పోలీస్, ఆర్మీ, ఐఏఎస్, ఐపీఎస్ విభాగాల్లోకి రావాలన్నారు.

ఉద్యోగాలకు 195 మంది ఎంపిక



నియామక పత్రాలు అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

అనంతపురము: నగరంలోని శ్రీసాయి మాస్టర్ మైండ్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ సంస్థ చైర్మన్ దీపక్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మెగా జాబ్‌మేళాకు స్పందన వచ్చిందని కళాశాల కరస్పాండెంట్ డా.పి.బసవయ్య తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తులు మాట్లాడుతూ.. యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. జాబ్‌మేళాలో టాటా, బీన్యూ, ముత్తూట్, ఐఐఎఫ్ఎల్, ఎస్‌బీఐ, కోజెంట్ ఈ సర్వీస్ కంపెనీలు పాల్గొన్నాయి. 349 మంది పైగా యువత జాబ్‌మేళాకు హాజరు కాగా.. 195 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో సీడాప్ జేడీఎం సూర్యనారాయణ, డీఎస్‌డీఓ ప్రతాప్ రెడ్డి, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ కల్యాణి, ప్రిన్సిపాల్ సతీష్ నాయక్, ప్లేస్మెంట్ ఆఫీసర్లు మహేష్, నారాయణ స్వామి, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఏఎన్ఎం' దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎంపీహెచ్‌డబ్ల్యూ ఫిమేల్ ట్రైనింగ్ స్కూల్‌లో ఏఎన్ఎం కోర్సులో ప్రవేశానికి ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించారు. ఈ మేరకు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భ్రమరాంబదేవి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వయసుతో నిమిత్తం లేకుండా ఈ కోర్సులో చేరే అవకాశముంది. నిర్ణీత గడువు లోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

రెసండా ట్రాన్స్‌పోర్ట్ ప్రారంభం

అనంతపురం సెంట్రల్: నగరంలోని రుద్రంపేట బైపాస్ సమీపంలో రెసండా ట్రాన్స్‌పోర్టు కార్యాలయాన్ని ప్రారంభించినట్లు నిర్వాహకుడు సాయిసుమంత్ తెలిపారు. ట్రాన్స్‌పోర్ట్ రంగంలో అనేక సంవత్సరాలుగా అనుభవం ఉన్న సంస్థ అని, అనంతపురం నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా బస్సులను తీర్చిదిద్దినట్లు వివరించారు. సరసమైన ధరలకే టికెట్లు ఉంచినట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సరికొత్త ప్రమిదలు



దీపావళి, కార్తీక పర్వదినాలు ఇంకా వారం రోజులు ఉండగానే ఊరంతా దీపకాంతులు వెదజల్లే ప్రమిదలు వివిధ రూపాల్లో మార్కెట్‌లోకి వచ్చేశాయి. వివిధ ఆకృతుల్లో ప్రమిదలు ఆకట్టుకుంటున్నాయి. బృందావనం, శంఖు, దేవాలయం, పద్మం, స్తంభం, వినాయకుడు వంటి వివిధ దేవతారూపాల్లో ప్రమిదలు దర్శనమిస్తున్నాయి. వీటిని కొనడానికి జనం ఆసక్తి చూపుతున్నారు. పాతూరు, కళ్యాణదుర్గం రోడ్డు, రామ్‌నగర్, టవర్‌క్లాక్ తదితర ప్రదేశాల్లో ప్రమిదల అమ్మకాలు సాగుతున్నాయి. ఒకప్పుడు కుమ్మరులు మాత్రమే సాధారణమైన ప్రమిదలను తయారు చేసే వారు. ఇటీవల పెద్ద పెద్ద మాల్స్‌లో యంత్రాలపై అద్భుత వర్ణశోభతో తయారైన రంగు రంగుల ప్రమిదల అమ్మకాలు ఆన్‌లైన్‌లోనూ జోరందుకున్నాయి. గతేడాది వరకు ఐదారు ప్రమిదలను రూ.10 కే ఇచ్చేవారు. అయితే రోజురోజుకు పెరుగుతున్న ధరలతో అమ్మకం కష్టంగా మారిందని కుమ్మరులు చెబుతున్నారు. కొత్తగా తయారు చేసిన ప్రమిదలను కూడా తక్కువ ధరకే అందించేందుకు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

– అనంతపురం కల్చరల్:



మార్కెట్‌లో ప్రమిదలను విక్రయిస్తున్న మహిళ



పూర్ణకుంభం ఆకారంలో ప్రమిద